# చెడిన పెళ్ళి

ఇప్పుడంతా మరచిపోయినారు గాని, అప్పట్లో నారాయణమూర్తి పెళ్ళి గురించి విడ్డూరంగా చెప్పుకోనివారు లేరు. చెప్పుకున్నారంటే చెప్పుకోరూ? ఎంత తొందరలో చేసిన పెళ్ళిళ్ళు కూడా అంత అభాసు కావటం తగదు. పీటలమీద చెడిన పెళ్ళిళ్ళున్నై. మనస్పర్థలతో చెడిన కాపరాలున్నై, కాని నారాయణ మూర్తి పెళ్ళికి మల్లే చెడిన పెళ్ళిళ్ళు ఎక్కడా కానం.

అవి శారదా చట్టం వచ్చిన రోజులు. ఆడపిల్లలు గల తండ్రులంతా మతిపోయి సంబంధాల కోసం వెతకసాగారు. పాపం, వాళ్ళ ప్రాణానికి వివాహసంస్థే రద్దయి పోతోందనిపించింది. రజస్వలానంతర వివాహాలు జరిగితే ఆ పెళ్ళిళ్ళకు కలిగే సంతు మనుష్యులే కారేమోనని భయపడ్డారు. నలుగురితో చావు పెళ్ళితో సమానమన్న జ్ఞానం కూడా వాళ్ళకి లేకపోయింది.

పోనివ్వండి, ఆడపిల్లల్ని కన్నాక ఇంకా మరి ఎక్కడుంటుంది? కాని మగపిల్లవాడి తండ్రి గదా, నారాయణమూర్తి తండ్రికేం తీపురం? దుడ దుడ సంబంధం నిశ్చయించాడు. వారం రోజుల వ్యవధి లేకుండా ముహూర్తం పెట్టించాడు. రెండేర్లు దాటి పెళ్ళివారు తరలి వెళ్ళారు. అంతా సవ్యంగానే నడిచింది. స్నాతకం అయింది. పీటల మీద కూర్చున్నారు. సరిగా ముహూర్తానికి పురోహితుడు పెళ్ళికూతురు నెత్తిన పెళ్ళి కొడుకుచేత ఉండ మెత్తించాడు. తరవాత సూత్ర ధారణ కూడా అయింది.

ఈ సమయానికి నారాయణమూర్తి చెవిలో పిడుగు వంటి మాట పడింది. పెళ్ళికూతురు మేనత్త అప్పుడే రైలు దిగి పెళ్ళికి వచ్చిందిట. రైలు గంట ఆలస్యమయిందిట. అందుచేత ముహూర్తానికి ముందుగా రాలేకపోయిందట. ఇందులో ఏముందీ? ఆవిడ పునర్వివాహం చేసుకున్న వితంతువుట. ఆ మాట వినేసరికి నారాయణమూర్తి తండ్రి అగ్నిహోత్రుడై పోయినాడు. తన కొడుకు పెళ్ళికి కులంచెడ్డవాళ్లు రా వీల్లేదన్నాడు.

వియ్యంకు లిద్దరికీ ఘోర యుద్ధమయి పోయింది. నారాయణమూర్తి మామగారు పెద్ద సంఘ సంస్కర్త అని ఖ్యాతి గలవాడుట. వియ్యంకుడి చాదస్తం ఆయన సహించలేక పోయినాడు. కోపంలో వళ్ళు తెలిసే బాపతుకాదు నారాయణమూర్తి తండ్రి. 'నువు కులం చెడితే నే నింకా చెడలేదు' అన్నాడాయన వియ్యంకుడితో. మాటమీద మాట పెరిగింది. ఇద్దర్నీ సర్దాలని అందరూ ప్రయత్నించారు. 'పెళ్ళికూతురు తండ్రివి కాస్త తగ్గాలి' అంటే నారాయణమూర్తి మామగారు కూడా వినకపోయినాడు. నారాయణమూర్తిని రెక్కపట్టుకు తండ్రి లాక్కుపోయినాడు. సాయంత్రందాకా బండి లేకపోయినా పెళ్ళివారంతా పెళ్ళి మిట్టమధ్యాహ్నంవేళ కాలుతున్న కడుపులతో రైలు స్టేషనులో కూచుని చీకటిపడేవేళ రైలెక్కారు!

అంతే! మళ్ళీ వారికీ వీరికీ రాకపోకలు గాని, సంబంధ బాంధవ్యాలుగాని లేవు. అనేక సంవత్సరాలు గడిచాయి. ఈ లోపుగా ఒకసారి కాబోలు, నారాయణమూర్తికి మరో పెళ్ళి చెయ్యాలని తండ్రి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం నారాయణమూర్తే పడగొట్టాడు అతను తన మొదటి భార్య మీద ఆశ పెట్టుకోలేదు. ఆమె కిప్పుడు పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళుండాలి. ఆమెచేత సవ్యంగా కాపరం చేయించేవాళ్ళయితే వాళ్ళవాళ్లు, ఏనాడో తన కోసం వెతుక్కుంటూ వచ్చేవాళ్ళే. అతను వాళ్ళను తప్పు పట్టలేదు. తన తండ్రి చేసిన పని అతనెన్నడూ సమర్థించలేదు. ఆడపిల్లల్ని కన్నవాళ్ళు అణగి పడుండాలని అతనికి నమ్మకం లేదు. వాళ్ళ కేపాటి అభిమానమున్నా తన తండ్రి క్షమాపణ యిస్తే

తప్ప మళ్ళీ మాట్లాడరు. ఆదరం నాకవసరంలేదు పో, అందే చాలా అవమానం. అయిందేమో అయింది. ఈసారి పెళ్ళాడితే మరొకరి ప్రసక్తి లేకుండా తనంతట తానే చేసుకుందామనుకున్నాడు. అతనికి ఇరవైనాలుగో ఏడు కూడా వచ్చింది. బియ్యే పాసయి మూడేళ్ళయింది. ఈ మూడేళ్ళు యింటి దగ్గర ఊరికే కూచుని అదృష్టవశాత్తు పట్నంలో ఉద్యోగం సంపాదించాడు. సంపాదన లేకపోతే అతనికి జరగదని కాదు. ఏదైనా సాధించాలని ఆశయం గలవాడు. మారుమూల పల్లెటూళ్ళో యెంతకాలం కూచుంటాడు గనకా?

ఆ ఉద్దేశంతో నారాయణమూర్తి పట్నం వచ్చేశాడు. అతనికి పట్నంలో ఎరిగిన వాళ్ళెవరూ లేరు. అతని దగ్గరబంధు వొకడు డాక్టరీ చదువుతున్నాడు. అదివరకు అతనంటే పెద్ద అభిమానం లేకపోయినా పట్నం వచ్చినాక అతనితో నారాయణమూర్తి జాస్తిగా తిరగసాగాడు. ఈ డాక్టరు విద్యార్థి పేరు హరనాథ్.

హరనాథ్ విచిత్రమైన వ్యక్తి. అతనికి చదువుకన్న సరదాలు జాస్తి. వచ్చ వచ్చగా ఉండే చోట్లకితప్ప వెళ్ళేవాడు కాడు. ఏ స్నేహితుడి యిల్లయినా అతనికి అందంగా కనిపించకపోతే అక్కడికి వెళ్లేవాడు కాడు. దారిన పోతున్నప్పుడల్లా మంచి యిల్లు కనిపించితే – ఈ యింట్లో యెవరితోన్నా సావాసం చేస్తే బాగుండునే అనుకునేవాడు. ఎక్కడ పెళ్ళి జరిగినా, ఏ పాటకచ్చేరి జరిగినా, ఏ సినిమా ప్రివ్యూ జరిగినా, ఏ గృహప్రవేశం, ఏ వార్షికోత్సవం జరిగినా తప్పకుండా వెళ్ళేవాడు. సొసైటీ లేడీస్ తరగతి కిందికి వచ్చేవారందరి పరిచయము చేసుకునేవాడు. అతన్ని ఎరగని వ్యక్తి పట్నంలో లేనట్టు తోచింది నారాయణమూర్తికి.

హరనాథ్‌కు పెళ్ళంటే భయం. కాని ఇతరులకు పెళ్ళి సంబంధాలు కుదర్చడం చాలా యిష్టం. గడిచిన ఏడెనిమిది సంవత్సరాల నుంచీ కూడా నారాయణమూర్తి పెళ్ళి కానివాడుగానే భావించాడు. నారాయణమూర్తీ, సుభద్రా స్నేహం చేసి పెళ్ళాడితే బాగుంటుందని హరనాథ్‌కు తోచింది. ఇద్దరికీ పరిచయం చెయ్యటమే అతని వంతు. ఆ పైన వాళ్ళ తిప్పలు వాళ్ళవి.

హరనాథ్ ప్రబోధంతో నారాయణమూర్తి సుభద్రవేపు ఆకర్షించబడ్డాడు. అతన్ని గురించి సుభద్ర కూడా గొప్పగా విన్నదేమో, ఆమె నారాయణమూర్తిని కొంచెం ప్రత్యేకంగా చూడసాగింది. ఎన్నడూ ఎవరి వెంటా ఒంటరిగా బయటికి వెళ్ళని సుభద్ర నారాయణమూర్తి వెంట సినిమాలకీ, పాట కచ్చేరీలకీ, బీచికీ, ఇతర చోట్లకీ రాసాగింది. ఈ పాకానికి వచ్చినాక హరనాథు వీళ్ళిద్దరూ పెళ్ళాడుతారనే ప్రచారం ప్రారంభించాడు. ఈ పుకారు సుభద్ర చెవినా పడింది.

నారాయణమూర్తి చెవినా పడింది. కాని వాళ్ళు విషయం పరస్పరం మాట్లాడుకో లేదు. ఇతరుల దగ్గర కాదననూ లేదు.

రేపు సుభద్ర పుట్టిన రోజనగా నారాయణమూర్తి సుభద్ర కోసం ఒక బహుమతి కొన్నాడు. హరనాథ్ కూడా అతని వెంట వచ్చాడు. షాపు నుంచి వస్తుండగా హరనాథు మరొక చోటికి దారితీసి, "ఇక్కడ ఒక స్నేహితురాలు వున్నది. ఆమెతో రేపు సుభద్ర పుట్టినరోజు మాట చెప్పి, ఆహ్వానం యిచ్చి వద్దాం" అన్నాడు.

"ఇక్కడ ఎరిగినవాళ్లున్నారని నాకు తెలీదే?" అన్నాడు నారాయణ మూర్తి.

"ఒట్టి ముదనష్టపు ఇల్లు. అందుచేత ఎంతో అవసరమైతే తప్ప రాను" అన్నాడు హరనాథు.

నారాయణమూర్తి కళ్ళకి ఆ యిల్లంత ముదనష్టంగా కనిపించలేదు. హరనాథు స్నేహితురాలు ఇంటి లోపాలన్నీ తీర్చ దగినట్టుగా ఉంది. మంచి కళగల మొహం. ఆమె కూడా డాక్టరు చదువే చదువుతున్నట్టు నారాయణ మూర్తి ఊహించాడు. ఆమె పేరు శారద. శారదకు ఆహ్వానం ఇస్తూ సుభద్రని పెళ్ళాడబొయ్యేది యితనేనని నారాయణమూర్తిని చూపాడు హరనాథు. శారద చప్పున అతని చెయ్యి పట్టుకుని "కంగ్రాచ్యులేషన్స్" అన్నది.

"నా పేరామెకు చెప్పావు కావేం?" అన్నాడు నారాయణమూర్తి.

"నీకు బంగారం లాంటి సుభద్ర ఉండగా మరొకరితో ఏం పని? షటప్" అన్నాడు హరనాథ్, "చెయ్యి తగిలేటప్పటికి గిల్లిందా కొట్టినట్టున్నావే." అని పరిహాసం కూడా చేశాడు.

మరునాడు సుభద్ర పుట్టినరోజుకు అందరికన్నా ముందు హజరైనాడు నారాయణమూర్తి. అతను వచ్చేసరికి సుభద్ర ఇంకా డ్రెస్సు చేసుకుంటూనే వుంది. అతను కొంత సేపు హాలులో కాలుగాలిన పిల్లిలాగా తిరిగాడు. కొంత సేపటికి సుభద్ర వచ్చి అతన్ని కలుసుకుంది. కాని, అప్పటికి స్నేహితులు ఒక్కొక్కరే వచ్చి చేరుతూ వుండడంవల్ల ఆమెకు అతనితో ఎక్కువగా మాట్లాడే అవకాశం చిక్కలేదు. ఉన్న అవకాశాన్ని అతను ఏ విధంగానూ వినియోగపరచుకోలేదు. ఇవాళ అతను తనతో పెళ్ళిమాట ఏదో అంటాడని సుభద్ర ఎరుగును. అందరూ వెళ్ళిపోయినాక అప్పుడు చెబుతాడనుకుంది.

కాని నారాయణమూర్తి పార్టీ అయేవరకూ వుండనేలేదు. అతను ఎప్పుడు వెళ్ళిపోయినాడో చూసినవారూ లేరు. సుభద్రకు అతనిమీద చాలా కోపం

వచ్చింది. వచ్చిన వాళ్ళంతా మూర్తి ఏడనీ, పెళ్ళి ఎప్పుడనీ అడిగేవాళ్ళే. తమ కిద్దరికీ పెళ్ళి కాబోతోందని ప్రపంచానికంతకీ రూఢి అయినాకూడా అతను తనతో ఆ విషయం ఎందుకు తేల్చకపోవాలి? ఏమిటీ ముసుగులో గుద్దులాటా? తీరా వచ్చినవాడు ఎందుకు పారిపోవాలీ? వాళ్ళిద్దరూ ఇంతవర కెన్నడూ పోట్లాడుకుని వుండలేదు. ఆ ముచ్చట కూడా తీర్చుకుందామని సుభద్ర ఉవ్విళ్ళూరసాగింది.

అయితే పాపం. సుభద్ర ముచ్చట తీరలేదు. నారాయణమూర్తి తిరిగి సుభద్రను చూడటానికి రానేలేదు. అతను యెక్కడ వున్నాడో, ఏం చేస్తున్నాడో కనుక్కోవటానికి అతని ఆఫీసులో అడగవలసి వచ్చింది. పదిహేను రోజులు శలవు పెట్టాడని ఆఫీసులో చెప్పారు. అతని గది తాళంవేసి వుంది. అతను వూళ్ళో వున్నదీ లేనిదీ కూడా యింటివాళ్ళకి తెలీదు.

హరనాథువచ్చి ఈ విషయాలన్నీ సుభద్రకి చెబుతూ పరధ్యానంగా "ఎటూగాని రోజుల్లో అంతా శలవులు పుచ్చుకుంటారేం?" అన్నాడు.

"అంతా ఎవరు?" అన్నది సుభద్ర.

హరనాథు తేలుకుట్టినట్టు లేచాడు. మూడు రోజులక్రితం అతను శారద శలపెట్టి ఊరికి వెళ్ళినట్టు విన్నాడు. శారద శలవు పెట్టడానికీ, నారాయణమూర్తి శలవు పెట్టడానికీ సంబంధం వుండవచ్చునని అతను కలలో కూడా అనుకో లేదు. కాని, ఎందుకు సంబంధం వుండగూడదూ? నారాయణమూర్తి అలాంటి సాధువు అని నమ్మరాదు. వాళ్ళే దేనికైనా తెగబడేది?

"ఏమిటి సంగతి?" అన్నది సుభద్ర.

"ఏమీలేదు. ఏదో జ్ఞాపకం వచ్చింది" అన్నాడు హరనాథ్. సుభద్ర తరచి అడగలేదు.

మరో వారంరోజులకి నారాయణమూర్తి తిరిగివచ్చాడు. హరనాథుడు చైనా బజారులో కనిపించబట్టే ఆ విషయం తెలిసింది.

"ఎక్కడ మాయమైనావు? నీ కోసం చూడలేక చచ్చాం. సుభద్ర నువ్వేమైనావో అని బెంగపడింది" అన్నాడు హరనాథ్.

"మా వూరెళ్ళాను. నిన్నరాత్రే వచ్చాను. కొన్ని చిక్కుల్లో పడటంవల్ల ఎవరికీ రాయలేదు" అన్నాడు నారాయణమూర్తి. అతని మొహంలో ఏదో దిగులున్నట్లు తోచింది హరనాథ్‌కు. తాను పొరబడ్డా ననుకున్నాడు. అయినా రూఢి చేసుకుందామని 'శారదా నువ్వూ ఒక్క రైల్లోనే వెళ్ళారా?' అన్నాడు.

మూర్తి దొరికిపోయినవాడి మొహం పెట్టలేదు. అమాయకుడల్లే ఏ శారద

అని అయినా అడగలేదు. లేదన్నాడు. మళ్ళీ హరనాథుకు అనుమానాలన్నీ వచ్చి ఆవరించాయి.

"ఈ మధ్య శారదను చూశావా?" అన్నాడు హరనాథు.

"ఏమిటీ క్రాసుపరీక్ష? శారద నీ పెళ్ళామా, చెల్లెలా! శారదను నువు తప్ప ఇంకెవ్వరూ చూడరాదా?" అని నారాయణమూర్తి కసిరాడు.

శారద నారాయణమూర్తికి మధ్య ఏదో నడుస్తున్నదని హరనాథు గ్రహించాడు. అతని భుజంమీద చెయ్యివేసి "అబ్బాయీ, చిన్నవాణ్ణో, పెద్ద వాణ్ణో నీకొక సలహా చెబుతా విను. శారద చాలా అందగత్తే. తెలివిగలది కూడాను. కాని చాల అపాయకరమైన మనిషి. అందుకే మిమ్మల్ని ఆరోజు నేను పరిచయం చెయ్యలేదు. సుభద్రను వొదిలేసి శారదను పెళ్ళాడదామనుకుంటు న్నావేమో, అట్లా అనుకుంటే నీ అంత ఫూలుండబోవటంలేదు." అన్నాడు హరనాథ్.

"నేను శారదను పెళ్ళాడబోవటంలేదు. బెంగపడకు" అన్నాడు నారాయణమూర్తి.

"ఊరికే స్నేహం చేద్దా మనుకుంటాన్నావేమో అదీ లాభంలేదు. నీ బాబుల్లాంటివాళ్ళు ప్రయత్నించారు. ఏమీ లాభంలేదు. శారద ఎవడికీ దక్కదు" అన్నాడు హరనాథు.

"ఏం? శారద మనిషికాదా? శారద వొంటో ప్రవహించేది వేడి రక్తం కాదా!" అన్నాడు నారాయణమూర్తి.

"శారద నిర్మొహమాటంగా చెప్పేసింది. ఆమె పెళ్ళాడదు. పెళ్ళంటే బందిఖానాయే-నని ఆవిడ ఉద్దేశం. లేడీ డాక్టర్సులో పెళ్ళాడని వాళ్ళు చాలా మంది వున్నారు. ఎవడితోనైనా సావాసం చేస్తుంది. వాడు లక్షాధికారై వుండాలి. వాడు తనకు లక్షలు ఇవ్వాలి. తనమీద ఎటువంటి హక్కూ చలాయించరాదు. తనకు నచ్చాలి. నామాట నమ్మకం లేకపోతే శారదను వెళ్ళి అడుగు" అన్నాడు హరనాథ్.

"అక్కర్లేదు, నీమాట నమ్మాను" అంటూ నారాయణమూర్తి వెళ్ళి పోయాడు.

హరనాథు నేరుగా శారద యింటికి వెళ్ళాడు. శారదతో కూడా మాట్లాడితే గాని అతని కడుపు నొప్పి వుపశమించేటట్టు కనబడలేదు.

ఆరోజు ఆదివారమైనా, శారద ఎక్కడికో వెళ్ళబోతున్నది. హరనాథు నారాయణమూర్తి మాట ఎత్తగానే శారద "ఆ విషయం చాలా మాట్లాడవలని

వుంది. తరవాత మాట్లాడదాం" అన్నది. హరనాథు సుభద్రను చూడడానికి వెళ్ళిపోయినాడు.

శారద నేరుగా నారాయణమూర్తి గదికే వెళ్ళింది. అతను ఆమెకోసం ఎదురు చూస్తున్నాడు.

"మనం ఈవిధంగా ఎన్నాళ్ళు చర్చించినా ఏమీ లాభంలేదు. నాకు మీరేమీ అపచారం చెయ్యలే దంటున్నానుగదా. నా దారిన నన్ను పోనివ్వరాదా? ఇన్నేళ్ళయినాక ఈ సమస్య పరిష్కరించకపోతే ఏం?" అన్నది శారద కూర్చుంటూ.

"సమస్య విషయం విడిచిపెట్టియి, శారదా! ఏ విషయంలో ద్రోహం చేసింది నేను కనుక ఆ విషయం మరిచిపోలేను. నేను మరొకణ్ణనుకో. ఏ షరతు మీదైనా నన్ను పెళ్లాడగలవా? అని అడుగుతున్నాను" అన్నాడు నారాయణ మూర్తి.

శారద నవ్వి "నేను మళ్ళీ పెళ్ళి ఎట్లా చేసుకోను? నా పెళ్ళి అదివరకే అయిపోయింది" అన్నది.

"నీకు డబ్బిచ్చేవాడెవడైనా వుంటే స్నేహం చేస్తావు" అన్నాడు నారాయణమూర్తి.

"నన్ను మీరు కొనలేరు. మర్యాదగా ఆ సుభద్రను పెళ్ళాడండి" అన్నది శారద.

"నాకు సుభద్ర అవసరంలేదు. మొగుడు వదిలేస్తే మూలకూచుని ఏడవ కుండా తన జీవితం తాను చూసుకోగల మనిషి కావాలి" అన్నాడు నారాయణ మూర్తి.

"అటువంటి మనిషి దొరక్కపోతే ఏం చేస్తారు?" అన్నది శారద.

"అటువంటి వాళ్ళున్నారని తెలిసిన తరువాత పెళ్ళాడటానికి ప్రయత్నిస్తాను. తెలియనప్పుడు ఎవర్నో ఒకరిని పెళ్ళాడదామనుకున్నాను" అన్నాడు నారాయణమూర్తి.

శారద కాస్త ఆలోచించి- "ఇదివరకు చెప్పలేదు. నాకొక స్నేహితుడు దొరికేటట్టున్నాడు. చాలా డబ్బుగలవాడు. బీచిలో పెద్ద మేడకూడా వుంది. అతని మొదటిభార్య ఎవరితోనో లేచిపోయింది. మళ్ళీ పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు. అతని పేరు-" అంటుండగానే నారాయణమూర్తి అడ్డంవచ్చి "అతని వివరాలు నాకవసరంలేదు. నిన్నవసరంగా శ్రమపెట్టాను. వెళ్ళు, శారదా" అన్నాడు అకస్మాత్తుగా.

"అసూయా?" అన్నది శారద.

"ఇంతవరకు లేదు. ఇకముందు రావచ్చు. నీ స్నేహితుడి దగ్గరకు

వెళ్ళి, నేను నీ మొగుణ్ణని చెబితే అతను బెదిరిపోవచ్చు. నీ కేవిధమైన ఆటంకం కలిగించటమూ నాకిష్టంలేదు. నువ్విక వెళ్ళిపోవచ్చు. నేను నీతో మాట్లాడేది యింకేమీ లేదు" అన్నాడతను.

"ఎందుకట్లా తొందరచేసి పంపించేస్తున్నారు!" అన్నది శారద.

"నేను నీ మీది గౌరవంకొద్దీ నిన్ను పెళ్ళాడాలనుకున్నాను; డబ్బుకోసం నువు గౌరవించలేని మనిషి దగ్గిరికి పోతానంటున్నావు. మనిద్దరమూ కలవలేం" అన్నాడతను.

"నా కతనిమీద గౌరవంలేదని మీ రెట్లా చెప్పగలరు?" అన్నది శారద కోపంగా.

"ఒక పెళ్ళాన్ని దక్కించుకో లేనివాడు మరొకతెను దక్కించుకోగలడని నాకు నమ్మకం లేదు" అన్నాడతను.

"ఆడవాళ్ళలో మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ వుండరా? అన్నది శారద.

"వరహా కెత్తయిన మాట చెప్పావు. ఆడవాళ్ళలో మట్టుకు మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ వుండరా?" అన్నాడతను.

అతను తనను ఎత్తి పొడుస్తున్నాడని గ్రహించి శారద మండిపోయింది. "మీరు నాకు చేసిన ఘోరమైన అన్యాయానికి తోడు నన్ను పరిహసించనవసరం లేదు" అన్నదామె.

"ఆ అన్యాయం గురించి నువు నా మీద ఆగ్రహం చూపి వుంటే మనం ఇంతదాకా మాట్లాడ నవసరం వుండేదికాదు. జరిగిన దానికి నేను క్షమాపణ చెప్పుకొని పరిహారం చేస్తానంటే వద్దన్నదానవు నువే. ఆ విషయం ఎత్తనే వద్దన్నావు. మాట్లాడనిస్తున్నావు గనుక ఆ అన్యాయం గురించి ఒక ప్రశ్న అడుగుతాను చెప్పు. మా నాన్న వొట్టి ఛాందస బ్రాహ్మడే. ఒప్పుకుంటాను. మీ నాన్న గొప్ప సంస్కారి గద. పదేళ్ళు దాటి దాటకుండానే నీకెందుకు పెళ్ళి చేయవలసి వచ్చింది? మీ మేనత్త ధనసహాయం పొందుతూ వుండటం వల్ల కాదా మీనాన్న మా నాన్నతో ఆనాడు అంత పోట్లాట పోట్లాడింది?" అన్నాడు నారాయణమూర్తి.

శారద మరి మాట్లాడలేదు. ఆమె నారాయణమూర్తిని రెండోసారి పోగొట్టుకున్నది. ఈసారి పరాయివాళ్ళ తప్పేమీలేదు.

ఆ సాయంకాలమే నారాయణమూర్తి సుభద్రను చూడబోయినాడు. సుభద్ర డాబామీద చల్లగాలిలో తిరుగుతున్నది. నారాయణమూర్తి వెళ్ళి సుభద్ర రెండు చేతులూ పట్టుకుని "మన పెళ్ళి ఎప్పుడు సుభద్రా?" అన్నాడు.

[ప్రథమ ముద్రణ : జూన్ 1948, ఆంధ్రజ్యోతి మాసపత్రిక]